క్లుప్తంగా

14 నుంచి బ్రహ్మోత్సవాలు

తాంసి: భీంపూర్ మండలంలోని ధనోర వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను ఈనెల 14వ నుంచి 16 వరకు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ అజయ్ తెలిపారు. ఇందులో భాగంగా ఆలయంలో హోమం, అర్చన, నవగ్రహపూజ, కల్యాణం, ఊరేగింపు కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఆలయ వార్షికోత్సవం

బోథ్: మండలంలోని నిగిని పరిధిలోని కైలాస్ టెకిడి సర్వదేశ్వర ఆలయం 21వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ముగిశాయి. ముగింపు రోజున కాశీ జగత్‌గురు మల్లికార్జున్ విశ్వరాధ్యాయ శివాచార్య మహరాజ్, శాంతి వీర లింగ శివాచార్య, మహరాజ్, భీమ లింగేశ్వర శివాచార్య మహరాజ్, లింబాజీ మహరాజ్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. 108 కలశాలతో రుద్రాభిషేకం, హారతి, మండపం పూజ, బ్రహ్మణ పూజ, హోమం, పూర్ణహారతి నిర్వహించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



విద్యార్థులకు బ్లాంకెట్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

ఉట్నూర్‌రూరల్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా సీపా కోఆర్డినేటర్ వసంత్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎయిమ్ ఫర్ సేవా అనాథ శరణాలయంలో హైదరాబాద్‌కు చెందిన వసుందర జ్యూవెలర్స్ ఆధ్వర్యంలో కొలాం గిరిజనులకు ఉచితంగా అందించిన బ్లాంకెట్లను పంపిణీ చేశారు. అనాథ పిల్లలు తమకు ఎవరూ లేరని బాధపడొద్దన్నారు. కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ఠాకూర్ గోపాల్‌సింగ్, దాల్‌మిల్ చైర్మన్ కుమ్ర విఠల్ రావు, శ్రీనివాస్, వసుందర్ జ్యూవెలర్స్ సంస్థ సభ్యులు లక్ష్మణ్, రాఘవా, మోతీరాం, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

ఆదిలాబాద్‌టౌన్: బహుజన్ టీచర్స్ ఫెడరేషన్ (బీటీఎఫ్) జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం ఆదిలాబాద్ పట్టణంలో ఎన్నుకున్నారు. కార్యవర్గ సమావేశానికి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదగిరి హాజరయ్యారు. ఎన్నికల పర్యవేక్షణ అధికారిగా దామోదర్, శ్రీకాంత్, నాగరాజు వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా కాంబ్లే విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా సూర్యవంశీ నాందేవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జాతీయ అధ్యక్షుడిని కలిసిన ఎంఐఎం నాయకులు

ఎదులాపురం: ఎంఐఎం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీని జిల్లా నాయకులు శనివారం హైదరాబాద్‌లోని దారుస్సలాంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఏడుగురు ఎమ్మెల్యేలు గెలుపొందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా రాజకీయ పరిస్థితులపై సమీక్షించారు. జిల్లా సంయుక్త కార్యదర్శి షకీల్ అహ్మద్, సుభన్ అలీ, అహ్మద్ ఖాన్, సిరాజ్ పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ శాఖ కేటాయింపుపై హర్షం

కైలాస్‌నగర్: తెలంగాణ నూతన పంచాయతీ రాజ్‌శాఖ మంత్రిగా సీతక్కను నియమించడం హర్షనీయమని జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, ప్రశాంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యదర్శుల ఏళ్ల సమస్యల పరిష్కారం దిశగా మంత్రి సమ్మె సమయంలో తమకు హామీ ఇచ్చారని తెలిపారు. వాటిని నెరవేర్చేలా చర్యలు తీసుకుంటారనే ధీమా వ్యక్తం చేస్తున్నామన్నారు.

దివ్యాంగులకు అన్నిరకాల సౌకర్యాలు కల్పించాలి

ఎదులాపురం: దివ్యాంగులు అన్నిరకాల సౌకర్యాలు కల్పించాలని ఎన్‌పీఆర్‌డీ జిల్లా ఇన్‌చార్జి బండి దత్తాత్రి అన్నారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో శనివారం ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్‌కట్ చేసి దివ్యాంగులకు తినిపించారు.

సన్మానం

ఆదిలాబాద్: ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ పట్టా అందుకున్న చిన్ననాటి స్నేహితుడిని తోటి మిత్రులు ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీకి చెందిన శివకుమార్ కందేకర్ పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో పదో తరగతి వరకు చదువుకున్నాడు. ఇటీవల ఆయన విద్యా విభాగంలో పీహెచ్‌డీ పట్టా అందుకోగా.. పాఠశాలకు చెందిన ఆయన స్నేహితులు జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శనివారం శాలువా, జ్ఞాపికతో సన్మానించారు.

నూతన కార్యాలయంలోకి అడుగుపెట్టేదెప్పుడో?



నూతనంగా నిర్మించిన మున్సిపల్ కార్యాలయ భవనం

- అన్ని హంగులతో సిద్ధమైన మున్సిపల్ భవనం
- ఎన్నికల కోడ్ ఎత్తివేయడంతో పాలనకు మార్గం సుగమం

కైలాస్‌నగర్: గ్రేడ్- 1 స్థాయి కలిగిన ఆదిలాబాద్ మున్సిపల్ నూతన కార్యాలయ భవనం అన్ని హంగులతో సుందరంగా ముస్తాబైంది. రూ.5 కోట్ల వ్యయంతో పాత కార్యాలయం ఎదుట ఉన్న స్థలంలో నిర్మించిన భవనాన్ని ఎన్నికల కోడ్‌కు కొన్ని రోజుల ముందే ఎమ్మెల్యే జోగు రామన్న ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. అయితే ఆ భవనంలో నుంచే కార్యాలయ పరిపాలన వ్యవహారాలు ప్రారంభమవుతాయని భావించారు. కానీ అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో బ్రేక్ పడింది. తాజాగా ఎన్నికల కోడ్ ఎత్తివేయడంతో నూతన కార్యాలయంలో పరిపాలన వ్యవహారాలకు మార్గం సుగమమైంది. అయినా.. అక్కడ నుంచి పరిపాలన ప్రారంభం కాలేదు.

అన్ని హంగులతో ముస్తాబు..

ప్రస్తుత మున్సిపల్ కార్యాలయ భవనం బాగానే ఉన్నప్పటికీ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పరిపాలనకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఉండేలా ఎస్‌డీఎఫ్ నిధులు రూ.5 కోట్ల వ్యయంతో నూతన భవనాన్ని నిర్మించారు. కార్యాలయంలోని అన్ని విభాగాలు సౌకర్యవంతంగా పాలన వ్యవహారాలు నిర్వహించడంతో పాటు మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల నిర్వహణకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉండేలా మూడు అంతస్తుల్లో నిర్మించారు. గ్రౌండ్ ఫ్లోర్‌ను ప్రత్యేకంగా పార్కింగ్ కోసం కేటాయించారు. ఇటీవల భవన నిర్మాణ పనులు పూర్తి కావడంతో అప్పటి ఎమ్మెల్యే జోగు రామన్న దంపతులు, మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌లతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. హోమం నిర్వహించడంతో పాటు సర్వమత ప్రార్థనలతో కార్యాలయాన్ని ప్రారంభించారు.

ప్రారంభంపై సర్వత్రా చర్చ

తాజాగా ఎన్నికల కోడ్ ఎత్తివేయడంతో మున్సిపల్ నూతన కార్యాలయంలో పాలన వ్యవహారాలు ఎప్పుడు ప్రారంభమవుతాయని జోరుగా చర్చ జరుగుతుంది. ఇటీవల భవనానికి నూతనంగా రంగులను అద్ది సుందరంగా ముస్తాబు చేశారు. అధికారులు ఉద్యోగుల ఛాంబర్లకు అవసరమైన టేబుల్లు, కుర్చీలతో పాటు ఫర్నిచర్‌ను సమకూర్చారు. ప్రారంభానికి అన్నివిధాల సిద్ధం కావడంతో అందులో ఎప్పుడు అడుగు పెడుతారు, అధికారికంగా అందులో పరిపాలన ఎప్పటి నుంచి ప్రారంభమవుతుందనే దానిపై అటు రాజకీయ వర్గాలతో పాటు ఇటు మున్సిపల్ ఉద్యోగులు, కౌన్సిలర్లలోనూ చర్చ సాగుతోంది. నూతన కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సౌకర్యవంతంగా ఉండే వెసులుబాటు కలుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వారం రోజుల్లో అందుబాటులోకి



మున్సిపల్ నూతన కార్యాలయ భవనం అన్ని విధాల సంసిద్ధమైంది. ప్రారంభానికి సంబంధించి పూజలు కూడా పూర్తయ్యాయి. ఎన్నికల కోడ్ కారణంగా ప్రారంభాన్ని వాయిదా వేయడం జరిగింది. భవనంలోకి పరిపాలన వ్యవహారాలు మార్చడంపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం. వారం రోజుల్లోనే నూతన కార్యాలయం నుంచే పరిపాలన వ్యవహారాలు ప్రారంభించేలా చూస్తాం.

– ఏ.శైలజ, మున్సిపల్ కమిషనర్

ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

నార్నూర్: మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు మాట్లాడుతూ.. మండలంలో మొత్తం ఐదు బృందాలుగా ఏర్పాటు చేసి, సికిల్‌సెల్ వ్యాధిపై రక్తపరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. ప్రతీ సోమవారం, మంగళవారం, గురువారం, శుక్రవారం సికిల్‌సెల్ పరీక్షలు చేస్తామన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్ చౌహాన్, హెచ్‌ఈ నాందేవ్, ప్రధానోపాధ్యాయుడు విఠల్ పాల్గొన్నారు.

రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

ఆదిలాబాద్‌రూరల్: రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు ఆదిలాబాద్ రూరల్ మండలం అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు సర్ఫారాజ్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని తెలంగాణ రెసిడెన్షియల్ గిరిజన పాఠశాల, కళాశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు రక్త పరీక్షలు చేసి, రక్తం తక్కువగా ఉన్న విద్యార్థులకు చికిత్స చేయడం జరుగుతుందన్నారు. నాణ్యమైన భోజనం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్స్ బొమ్మెత సుభాష్, ఆడే సురేశ్, హెల్త్ అసిస్టెంట్స్ శ్రీవాణి, నల్ల ఈశ్వర్ రెడ్డి, పవర్ ప్రేంసింగ్, కళాశాల ప్రిన్సిపాల్ ఆగస్టిన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీపీ జైవంత్‌రావు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని సాకెర(బి) గ్రామంలో క్రికెట్ పోటీలను ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలతో స్నేహభావం ఏర్పడుతుందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణంలోని గడియారం కాలనీకి చెందిన యువకుడు కొత్త అశోక్ శనివారం మృతి చెందడంతో మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆయన కుటుంబాన్ని పరామర్శించి రూ. 5వేల ఆర్థిక సాయం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లూరి భూమన్న నాయకులు ప్రభాకర్, వరప్రసాద్, క్రాంతి, సురేశ్, సాయిబాబా, వినోద్, అరుణ్, రాజన్న పాల్గొన్నారు.

గ్రంథాలయం నిర్మాణానికి విరాళం

తాంసి: గ్రంథాలయం నిర్మాణానికి మండలంలోని కప్పర్లలో గ్రామస్తులు స్వచ్ఛందంగా విరాళాలు అందిస్తున్నారు. శనివారం గ్రామానికి చెందిన యువకుడు అంకుష్‌రావు తనవంతుగా రూ.5 వేలు విరాళం గ్రామస్తులకు అందజేశాడు. ఈసందర్భంగా అంకుష్‌ను గ్రామస్తులు అభినందించారు.

క్షీరాభిషేకం

బేల: హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌ను మహాత్మా జ్యోతిబాపులే ప్రజాభవన్‌గా మార్చిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి జూనోని గ్రామంలో శనివారం మాలీ సంక్షేమ సంఘం సభ్యులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మాలీ సంక్షేమ సంఘం సభ్యులు గుర్నులే సురేశ్, నాగోసే మురళీధర్, అశిష్, ఋషి పాల్గొన్నారు.

విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి



విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

- కలెక్టర్ రాహుల్ రాజ్

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు చిన్నతనం నుంచే సైన్స్‌పై అవగాహన పెంపొందించుకుని నూతన ఆవిష్కరణలతో భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌కు ముఖ్య అతిథిగా హాజరై డీఈవో ప్రణీతతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. తమ కూతుళ్లు ఒకటో తరగతి చదువుతునన రిత్వికగాలి పీడన ప్రభావాన్ని చూపే ప్రాజెక్ట్‌ను తయారు చేయగా.. చిన్న కూతురు ఎల్‌కేజీ చదువుతున్న నిరీక్ష ప్రదర్శించిన ప్రాజెక్ట్‌లను కలెక్టర్ సతీమణి శ్రీజతో కలిసి తిలకించారు. వారి ప్రదర్శనలపై సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్ట్‌లను తిలకించి అభినందించారు. నిత్య జీవితంలో సైన్స్ పాత్ర ఎంతో ఉందని, మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రఘు రమణ, ప్రిన్సిపాల్ కమలాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి పల్లకి ఊరేగింపు



వడూర్‌లో..



పల్లకిని ఊరేగిస్తున్న అయ్యప్పస్వాములు

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామంలో శనివారం అయ్యప్పస్వామి పల్లకిని శనివారం ఊరేగించారు. ఊరేగింపులో కప్పర్ల, జామిడి, నిపాని, తాంసి, పిప్పల్‌కోటి గ్రామాలకు చెందిన అయ్యప్ప దీక్షాదారులు పాల్గొన్నారు. మహిళలు మంగళ హారతులతో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప స్వామి నామస్మరణతో గ్రామం మార్మోగింది. కార్యక్రమంలో గురుస్వాములు సతీష్, మధుకర్, సర్పంచ్ సదానంద్, మార్కెట్ డైరెక్టర్ మహేందర్, స్వాములు పాల్గొన్నారు.

నేరడిగొండ: మండలంలోని వడూర్‌లో శనివారం అయ్యప్పస్వామి పల్లకి ఊరేగింపును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్ప స్వాములు పురవీధుల గుండా పల్లకిని ఊరేగించారు. మహిళలు మంగళ హారతులతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ నాయకుడు ఆడె గజేందర్, అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

అసెంబ్లీలో అడుగుపెట్టిన బోథ్ ఎమ్మెల్యే



అసెంబ్లీ వద్ద కుటుంబసభ్యులతో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ శనివారం ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు అనిల్ జాదవ్ తండ్రి రామారావు, భార్య హరిప్రియ, ఇద్దరు కుమారులను తీసుకెళ్లారు. ప్రమాణ స్వీకారం అనంతరం నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన నాయకులు, యువకులు ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

బోథ్ ఎమ్మెల్యేను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

ఇచ్చోడ/బోథ్: బోథ్ బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌ను శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అసెంబ్లీలో ప్రమాణ స్వీకా రం చేసిన సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కలిసిన వారిలో బోథ్ జెడ్పీటీసీ సంధ్యారాణి, ఇచ్చోడ, బోథ్ మండల కన్వీనర్లు కృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, బోథ్, నవేగావ్ పాండురంగ్, గాడ్గే సుభాష్, రుక్మన్‌సింగ్, తృప్తి గంగాధర్, నర్వాడే రమేశ్, బోథ్ సర్పంచ్ సురేందర్, రాథోడ్ రాయల్ ఉన్నారు.

ఉచిత బస్ ప్రయాణం ప్రారంభం



ఉచిత బస్‌ను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇంద్రవెల్లి: ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తోందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. శనివారం మహిళలకు ఉచిత ప్రయాణం కోసం ఏర్పాటు చేసిన బస్ డ్రైవర్, కండక్టర్లను సన్మానించారు. మహిళలు ఉచిత బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరు గ్యారంటీలు తప్పకుండా అమలవుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు పవార్ దుదిరాం నాయక్, ఎండీ మసుద్, ముఖడే ఉత్తం, జహీర్, మీర్జా యాకుబ్ బేగ్, సోమోరే నాగోరావ్, సోమసే వెంకట్‌రావ్, ఇందిరాబాయి, జితేందర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే మహిళలకు గౌరవం

ఇచ్చోడ: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు గౌరవం కల్పించిందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిముద్ ఖాన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్‌లో మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యాన్ని ప్రారంభించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఇలాగైతే.. నవ్విపోతారు



అధికారుల సమన్వయలేమికి నిదర్శనమే ఈచిత్రం. నేరడిగొండ మండలంలోని కొర్టికల్(బి) నుంచి కొర్టికల్(కె) జాతీయ రహదారి పక్కన గల సర్వీసు రోడ్డుపై నూతనంగా బీటీ పనులు ప్రారంభమయ్యాయి. అయితే రహదారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించకుండా రోడ్డు వేస్తున్నారు. రాత్రి వేళల్లో ఈ రోడ్డు గుండా ప్రయాణించే ప్రజలు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. అధికారులు స్పందించి రోడ్డు మధ్యలోని విద్యుత్ స్తంభాలను తొలగించాలని కోరుతున్నారు.

– నేరడిగొండ

సోనియాగాంధీ జన్మదిన వేడుకలు



నేరడిగొండ: జన్మదిన వేడుకల్లో పాల్గొన్న నాయకులు



ఉట్నూర్‌రూరల్: కేక్‌కట్ చేస్తున్న నాయకులు

ఎదులాపురం/జైనథ్/బోథ్/తాంసి/ఉట్నూర్‌రూరల్/తలమడుగు/నేరడిగొండ/గుడిహత్నూర్: ఏఐసీసీ అగ్రనేత సోనియా గాంధీ ఆయురారోగ్యాలతో ఉండాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి భగవంతుడిని ప్రార్థించారు. సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా శనివారం తిర్పెల్లి రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రిమ్స్‌లో రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. జైనథ్ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద సోనియా గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. బోథ్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. తాంసి మండల కేంద్రంతో పాటు కప్పర్ల గ్రామంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలు కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులతో కలిసి కేక్‌కట్ చేశారు. అనంతరం నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఉట్నూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. సోనియా గాంధీ నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని ఆకాంక్షించారు. తలమడుగు మండల నాయకులు సోనియాగాంధీ జన్మదిన వేడుకలను సాయిలింగి గ్రామ శివారులోని వృద్ధాశ్రమంలో నిర్వహించారు. జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి వృద్ధులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం పండ్ల పంపిణీ చేశారు. వృద్ధాశ్రమానికి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. నేరడిగొండ మండల కేంద్రంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచి పెట్టారు. గుడిహత్నూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్ల చేశారు. ఆయా కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఆ నలుగురు ద్రోహుల కారణంగానే ఓటమి'



ర్యాలీలో అభివాదం చేస్తున్న కంది శ్రీనివాస రెడ్డి

కైలాస్‌నగర్: డబ్బులకు అమ్ముడుపోయిన పార్టీ ద్రోహులు గండ్రత్ సుజాత, సాజిద్‌ఖాన్, సంజీవ్‌రెడ్డి, భార్గవ్ దేశ్‌పాండేల కారణంగానే ఆదిలాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఓడిందని పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టడం, సోనియాగాంధీ 77వ జన్మదిన వేడుకలను శనివారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మావల బైపాస్ నుంచి పట్టణ ప్రధాన వీధుల గుండా అంబేద్కర్ చౌక్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 77 కేజీల భారీ కేక్‌ను కట్ చేశారు. ఆదిలాబాద్ అభివృద్ధి కోసం ప్రశ్నించకే గొంతుకగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకలు భూపెల్లి శ్రీధర్, బాలూరి గోవర్ధన్‌రెడ్డి, బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, ముడుపు దామోదర్‌రెడ్డి, ఆనంద్‌రావు, చరణ్‌గౌడ్, రూపేష్‌రెడ్డి పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే వివేక్‌కు మంత్రి పదవి ఇవ్వాలి'



మాట్లాడుతున్న నాయకులు

ఇచ్చోడ: కాంగ్రెస్ ప్రభుత్వంలో చెన్నూర్ ఎమ్మెల్యేగా గెలుపొందిన గడ్డం వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి ఇవ్వాలని మాల సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి గడ్డం వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి ఇచ్చి సమన్యాయం చేయాలన్నారు. ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి అణగారిన వర్గాలైన మాలలకు రాజకీయంగా, సామాజికంగా సముచిత స్థానం కల్పించాలని కోరారు. సమావేశంలో మాల సంక్షేమ సంఘం నాయకులు శాంతపురం రాజేశ్వర్, బొజ్జ రాజేందర్, బత్తుల విజయ్, తొగరి శేఖర్ పాల్గొన్నారు.